కథా నిలయం
4978
శ్రీకాకుళం

# గాలికథ

కిటికీ రెక్కలు టపటప కొట్టుకొన్నాయి.

బార్లా తెరుచుకొన్న కిటికీలోనుంచి గాలి విసురుగా లోపలికి వచ్చింది. టేబుల్‌మీద ఉన్న కాగితాలు ఎగిరి గదంతా చెల్లాచెదురుగా పడిపోయాయి. వాటితోపాటు అప్పారావు కుర్చీలోనుంచి చివుక్కున లేచాడు. కిటికీ రెక్కలు మూశాడు. అద్దాలలోనుంచి బయటకి చూశాడు.

కళ్ళు చూడలేని మెరుపులు. చెవులు భరించలేని ఉరుముల శబ్దం.

నేలమీద వడగళ్ళ మోత-ఉరుములు-మెరుపులు- గాలీ-వాన!

అప్పారావు గదిలో చెల్లాచెదురుగా పడిఉన్న కాగితాలు తీసి టేబుల్‌మీద సర్దిపెట్టుకొన్నాడు. రాసిన కాగితాలను పేజీలవారిగా పెట్టుకొన్నాడు. చివరి పేజీలోని ఆఖరు పేరా చదువుకొన్నాడు.

కలం తీసి ముందుకు వంగాడు-

ఊఁహూఁ! థాట్ బ్రేక్ అయింది. కలం ముందుకు కదలడంలేదు. నాలుగు పేజీలు వెనక్కు తిప్పి చదవసాగాడు...

☆ ☆ ☆

"స్వప్న డన్‌లప్ బెడ్‌మీదినుంచి ఎగిరి కిందకు దూకింది. కిందపడుతున్న స్వప్నను అమాంతం తన రెండు చేతుల్లో బంధించాడు జితేంద్ర. ఆమె ముఖంలోకి ముఖం పెట్టి, కళ్ళతో కళ్ళు కలిపాడు.

ఆమె కళ్ళు తేలవేసింది. నోరు తెరిచేసింది. జితేంద్ర ఆమె తెరిచిన నోటిని తన పెదవులతో నొక్కి మూసివేశాడు. స్వప్న పెనుగులాడుతోంది. గావుకేక వెయ్యబోయింది. కాని ఆమె కేకలు మృదువైన ముద్దుల శబ్దాలుగా మారాయి. అతడి వెచ్చని కౌగిలిలో కొద్దిక్షణాలు కరిగిపోయింది.

వెంటనే తేరుకొని "జిత్! డియర్! ఇంత అర్ధరాత్రి పూట గదిలోకి ఎలా రాగలిగావు? ఎలా సాహసం చేశావు డియర్!" అన్నది స్వప్న.

జితేంద్ర అదోలా చూసి, మరోలా నవ్వాడు.

"డార్లింగ్! నాకు సాధ్యంకానిది ఏముంది?" అని మరోసారి తన పెదవుల్ని ఆమె పెదవుల దగ్గరకు తీసుకెళ్ళాడు.

ఆమె ఒక్కసారిగా కెవ్వుమని, అరిచింది, అతడి పెదవులు ఆమె పెదవుల్ని

తాకకముందే. వెర్రిగా చూసింది అతడ్ని.

ఆమె గజగజ వణికిపోతున్నది.

"అసలు నువ్వు ఈ గదిలోకి ఎలా వచ్చావో చెప్పు! గది తలుపులు వేసి ఉన్నాయి. లోపల వేసిన బోల్టు వేసినట్టే ఉంది. తలుపులు తెరవకుండా లోపలకు ఎలా వచ్చావ్?"

"పిచ్చిపిల్లా! అంత భయం ఎందుకు? నేనే లోపలకు వచ్చాక బోల్టువేసి ఉండవచ్చుగా?"

"అయితే అసలు లోపలకు రావడానికి తలుపులు ఎవరు తెరిచారు?"

ఆ ప్రశ్న వింటూనే అతడి కళ్ళు కుంపటి నిప్పుల్లా కణకణలాడాయి.

"నువ్వే తీసి ఉండొచ్చుగా?"

ఆమె ఆ మాట వింటూనే తృళ్ళిపడింది. వెర్రిచూపులు చూసింది.

"అబ్‌సర్డ్! నేనా? అసంభవం!" అతడికి దూరంగా జరిగింది.

"నువ్వే! నువ్వే తీశావ్ డియర్!" అతడు ఆమె దగ్గరకు జరిగాడు.

"నో! నో! నన్ను పిచ్చిదాన్ని చేస్తున్నావ్. నేను తియ్యలేదు."

"బహుశా నువ్వు నిద్రలోనే తీసి, మళ్ళీ వెళ్ళి పడుకొని ఉంటావ్."

"జిత్! ఏమిటి నువ్వనేది? నేను స్లీప్‌వాకర్‌ననేగా! నో! నో! నేను స్లీప్‌వాకర్ను కాను."

జితేంద్ర అదోలా నవ్వాడు.

స్వప్నకు వళ్ళు ఝల్లుమన్నది.

"ఏమిటి అలా చూస్తున్నావ్? ఎవరు నువ్వు?"

"అదేం ప్రశ్న?" జితేంద్ర నవ్వాడు అదోలా.

"అలా నవ్వకు. ఎవరు నువ్వు? జితేంద్రవేనా?"

"కాక? మారువేషంలో వచ్చిన మాయల ఫకీరుననుకొంటున్నావా? అహ హ!" గలగల నవ్వాడు. ఆ నవ్వు చెడిపోయిన టేబుల్ ఫ్యాన్ చేస్తున్న శబ్దంలా వినిపించింది స్వప్నకు.

"నేను బాలనాగమ్మను కాను."

"అయితే గాండ్ల సంగువా?"

"స్టాపిట్. ముందు నువ్వెవరివో చెప్పు. ఈ గదిలోకి ఎలా ప్రవేశించగలిగావో చెప్పు. లేకపోతే గట్టిగా అరుస్తాను. మా వాళ్ళంతా వస్తారు." స్వప్న అరచినట్టే అన్నది.

"ఆ భయం లేదు. వాళ్ళు రారు. రాలేరు."

"ఎందుకు రాలేరు! మా అమ్మా-నాన్నా... అందర్నీ..." స్వప్న కంఠం ఎవరో నొక్కుతున్నట్టు కీచుమన్నది.

"డార్లింగ్! నేను మీ వాళ్ళను ఏమీ చేయలేదు. నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఇదంతా ఆ శరభయ్య మాంత్రికుడి పని. నీ క్లాసుమేట్ మూర్తి-వాడే ఇదంతా చేయిస్తున్నాడు. నీవు వాడి ప్రేమను తిరస్కరించావు. వాడు నీ మీద కసి పట్టాడు. నిన్ను ఎలాగైనా సర్వనాశనం చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. శరభయ్యచేత మీ ఇంట్లోవున్న వాళ్ళందరికీ చేతబడి చేయించాడు. ఆ దుర్మార్గుడి బారినుంచి నిన్ను రక్షించుకొనేందుకే ఈ అర్ధరాత్రి ఇలా వచ్చాను."

"ఓ డియర్!" స్వప్న అతడ్ని పెనవేసుకొని బావురుమన్నది.

"ఈజీ డార్లింగ్! ఈజీ!" అంటూ అతడు ఆమెను ఆపాదమస్తకం నిమిరాడు.

అతడి స్పర్శ ఆమె మనసును మత్తుతో చుట్టేసింది.

"అయితే డియర్! ఒక చిన్న సందేహం. ఆ మాంత్రికుడు శరభయ్య తన మంత్ర శక్తితో నా చేత ఈ గది తలుపు తీయించాడనే అనుకుందాం. మరి మెయిన్ డోర్ ఎవరు తెరిచారు?" జితేంద్ర కళ్ళల్లోకి చూసింది స్వప్న.

"అదా? అదీ–" జితేంద్ర తలెత్తి పైకప్పుకేసి చూడసాగాడు.

"ప్లీజ్ డియర్! నాకేదో భయంగా ఉంది. త్వరగా చెప్పు."

"చెబితే మరీ భయపడిపోతావేమోనని..."

"సస్పెన్సుతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాను. ప్లీజ్! త్వరగా చెప్పు."

"నువ్వు గది తలుపులు తియ్యలేదు."

"మరి? లోపలకు ఎలా వచ్చావ్?" పిచ్చిచూపులు చూసింది.

"అదిగో, ఆ బాత్ రూంలోనుంచి వచ్చాను."

"బాత్‌రూంలోనుంచా? ఎలా? దాని తలుపు ఈ గదిలోనుంచే ఉందిగా? వేరే మార్గంలేదు. ఏమిటో నాకంతా అయోమయంగా ఉంది" అన్నది స్వప్న అయోమయంగా.

"రా" చూపిస్తాను."

జితేంద్ర స్వప్నను బాత్‌రూంలోకి తీసుకెళ్ళాడు.

"అదిగో, అటు చూడు."

"ఇందులోనుంచా? కమోడ్‌లోనుంచి మనిషి ఎలా బయటికి వస్తాడు?"

"యు స్టుపిడ్ గర్ల్! డ్రైనేజీ గొట్టంలోనుంచి వచ్చాననుకొంటున్నావా? వాట్ ఏ డర్టీ థింగ్? అదిగో, అటు చూడు" చూపుడు వేలుతో చూపిస్తూ అన్నాడు.

"ఆ వెంటిలేటర్‌నుంచా? అందులో చెయ్యికూడా సరిగ్గా పట్టదు. మనిషి ఎలా వస్తాడు? గాలి తప్ప అందులో నుంచి మరేదీ రాలేదు."

"సరిగ్గా అదే జరిగింది" అన్నాడు జితేంద్ర.

"అంటే?"

"గాలిగా మారి వచ్చాను."

"గాలా?" స్వప్న నిలువుగుడ్లేసి చూసింది.

"అవును. మనిషి గాలిగా మారిపోవడం నువ్వెప్పుడూ వినలేదా?"

"లేదు. లేదు." అరుస్తూ స్వప్న అక్కడ్నుంచి గదిలోకి పరుగెత్తుకొచ్చి, మంచంమీద అడ్డంగా పడిపోయింది.

జితేంద్ర ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

"స్వప్నా! బి బోల్డ్. భూత, ప్రేత పిశాచాలను లొంగదీసుకోవాలంటే గుండె నిబ్బరం కావాలి. తాంత్రిక శక్తులను సాధించాలంటే సాధన కావాలి."

"అవన్నీ అభూత కల్పనలు. నేను నమ్మను." ఆరిపోతున్న పెదవులను నాలుకతో తడిచేసుకుంటూ అన్నది స్వప్న.

"మరి అయితే నేను లోపలకు ఎలా వచ్చానంటావ్?"

స్వప్న బెదురుచూపులు చూసింది.

"నువ్వు దయ్యాలని నమ్ముతావా?"

"నా చిన్నప్పుడు మా అత్తయ్యకు దయ్యం పట్టింది."

"అయితే ఆ దయ్యాన్ని నువ్వు చూశావా?"

"చూడలేదు. మా అత్తయ్యకు గాలి సోకింది అనేవాళ్ళు. మా పక్కింటి మంగమ్మను లంబాడీ దయ్యం పట్టింది. మంగమ్మకు గాలి సోకిందనే అనేవాళ్ళు."

"అంటే దెయ్యం గాలిలో వచ్చి మీ అత్తయ్యను పట్టుకొన్నదన్నమాటేగా?"

స్వప్న అయోమయంగా చూసింది.

"అంటే మనిషి చచ్చి దెయ్యం అవుతాడు. దెయ్యం గాలి అవుతుంది."

స్వప్నకు చెమట్లు పడ్తున్నాయి. బెదురుబెదురుగా చూసింది.

"సో రివర్స్ ఇట్! థీసిస్ అండ్ యాంటీ థీసిస్! గాలి దెయ్యం అవుతుంది. దయ్యం మనిషి అవుతాడు. దేర్ ఫోర్ గాలి మనిషి అవుతాడు-మనిషి గాలి అవుతాడు..."

"అది చచ్చినవాళ్ళ సంగతి. కాని బతికున్నవాళ్ళు గాలిగా ఎలా అవుతారు?" ఆమె కంఠంలో వణుకు.

"చచ్చినవాడు దెయ్యం కాగలిగినప్పుడు, బతికున్నవాడు దెయ్యం ఎందుకు కాలేడూ? చచ్చినవాడికంటే బతికున్నవాడు ఎక్కువ శక్తిమంతుడు గదా? తాంత్రిక శక్తుల్ని స్వాధీనం చేసుకున్నవాడికి ఇది సాధ్యమవుతోంది."

"అయితే... నువ్వు... నువ్వు... గాలిగా మారిపోగలవా?" అతిబలవంతంమీద అనగలిగింది స్వప్న.

"మారిపోగలను. కాని ఇప్పుడు ఇక్కడ సాధ్యంకాదు. దానికి మళ్ళీ భైరవారాధన చేయాలి. అదీ అర్ధరాత్రి శ్మశానంలో చేయాలి. చితిమీద కాలుతున్న శవం కపాల మోక్షం జరగ్గానే దాని మెదడు, దిగంబరంగా వంటికాలిమీద నిలబడి, కాలభైరవుణ్ణి పూజించి ఆరగించాలి. ఆ సమయంలో అనేక క్షుద్రదేవతలూ, భూత ప్రేత పిశాచ గణాలూ చుట్టూచేరి హాఁహాఁకారాలు చేస్తున్నా బెదిరిపోకూడదు."

స్వప్న వెర్రిగా అరచి స్పృహతప్పి పడిపోయింది.

✿ ✿ ✿

కిటికీ అద్దాలు పగిలి గచ్చుమీద పడ్డాయి.

అప్పారావు కుర్చీలోనుంచి ముందుకు పడ్డాడు.

చదువుతున్న కాగితాలు చేతిలోనుంచి కిందకు జారాయి.

అద్దాలు పగిలిన కిటికీ రెక్కలు టపటప కొట్టుకుంటున్నాయి.

గాలీ వానా విసిరి విసిరి లోపలకు వస్తోంది.

"అప్పారావ్! అప్పారావ్!"

గాలీవాన హోరులో పిలుపు విన్పించింది.

అప్పారావు వళ్ళు జలదరించింది.

గుండెలు బిగిసిపోయాయి.

అతికష్టంమీద లేచి కిటికీ దగ్గిరకు వచ్చాడు.

'అప్పారావ్! అప్పారావ్!' అదే పిలుపు. అదే గొంతు.

'ఎవరది?'

గొంతు పెగుల్చుకుంటూ అన్నాడు అప్పారావ్.

'నేనేరా! సుబ్బారావుని. తలుపుతియ్!'

'సుబ్బారావా!' అప్పారావు గొంతు ఎవరో నొక్కేస్తున్నట్టు 'కీచ్'మన్నది.

'అవున్రా బాబూ! సుబ్బారావునే! త్వరగా తలుపుతియ్!'

'ఎలా... వచ్చావ్?' మాటలు గొంతులో ఉంగిడి చుట్టుకుపోతున్నాయి.

'కృష్ణాలో వచ్చా. తడిసిపోతున్నాను. తలుపు తియ్యరా!'

"కృ...కృష్ణాలో... వస్తే - గో... గోదావరి...లో పో... పో."

'ఏమిట్రా నీ బొంద! అసలు నువ్వు అప్పారావేనా?'

'ను... నువ్వు... ఎప్పుడో చచ్చి...పోయావన్నారుగా? మళ్ళీ...ఎ...ఎట్లా వచ్చావ్?'

'నేను చచ్చిపోవడం ఏమిట్రా నీ బొంద! చచ్చిపోయింది పెద సుబ్బారావు. నేను చినసుబ్బారావున్రా బాబూ! తలుపుతియ్! చలితో చచ్చిపోతున్నా.'

అప్పారావు కిటికీ చువ్వలకు తల ఆనించి బయటికి చూశాడు. తళతళ మెరుపులు. భళ భళ ఉరుములు. సుబ్బారావు తడిసి ముద్దయి వణుకుతూ నిలబడి ఉన్నాడు. ఆ నిలబడి ఉన్నది చిన సుబ్బారావే.

అప్పారావు గుండెలనిండా గాలి పీల్చుకొన్నాడు.

'ఒరే, నువ్వట్రా సుబ్బులూ?' అంటూ వెళ్ళి తలుపులు తెరిచాడు.

సూట్‌కేస్‌తో సుబ్బారావు లోపలకు వచ్చాడు.

'ఏమైందిరా నీకు?' సుబ్బారావు సూట్‌కేసు కిందపెడ్తూ అన్నాడు.

అప్పారావ్ టవల్ అందించాడు.

తలా, వళ్ళూ తుడుచుకొంటూ "సూట్‌కేసులోని బట్టలుకూడా తడిసిపోయి నట్టున్నాయి" అన్నాడు సుబ్బారావు.

అప్పారావు లుంగీ, బనీనూ తెచ్చి ఇచ్చాడు.

'ఏమిట్రా! అంత కంగారుపడిపోయావ్?' బట్టలు మార్చుకుంటూ అడిగాడు సుబ్బారావు.

'అప్పుడు నేను ఎటువంటి మూడ్‌లో ఉన్నానో తెలిస్తే ఈ ప్రశ్న వెయ్యవు. అది సరే, కిటికీ అద్దాలు పగలగొట్టా వెందుకూ?'

"నేను అద్దాలు పగలకొట్టడం ఏమిటి? తలుపులు ఎంత బాదినా నువ్వు విన్పించుకోలేదు. కిటికీ దగ్గరకొచ్చి రెక్కలు నెట్టానో లేదో ఒకసారిగా ఉసిగా తెరుచుకున్నాయి. నువ్వు లోపల్నుంచి బోల్టు సరిగ్గా వేసినట్టు లేవు. గాలికి కొట్టుకొని అద్దాలు పగిలాయి. అప్పుడుగాని నీకు విన్పించలేదు. అదిసరే, మూడ్ అంటున్నావేమిటి? మన పెద సుబ్బారావు పోయినట్లు ఇవ్వాళే నీకు తెలిసిందా?" అడిగాడు సుబ్బారావు.

'కాదు. నాలుగు నెలల క్రితమే తెలిసింది.'

'మరైతే ఇవ్వాళ్ళెందుకురా అంత ఇదైపోతున్నావ్?'

"వాడు ఏండ్రిన్ తాగి చచ్చిపోయాడటకదరా?" ఆలోచిస్తూ అడిగాడు అప్పారావు.

"అవును పాపం! వాడి ఫామిలీపని ఏమీ బాగాలేదు. అది సరే, వాడ్ని గురించి ఎందుకు ఇవ్వాళ అంతగా ఆలోచిస్తున్నావ్? మూడ్ బాగా లేదన్నావ్? అందుకనేనా?" ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

'మూడ్ బాగా లేదనలేదు. మూడ్‌లో ఉన్నానన్నాను. నువ్వు వచ్చేసరికి మాంచి టెంపో-సస్పెన్సులో ఉన్నాను. ఓ భయానక బీభత్స దృశ్యాన్ని చిత్రిస్తున్నాను. సరిగ్గా అప్పుడే కిటికీ రెక్కలు కొట్టుకొని అద్దాలు పగిలాయి. దానికితోడు నువ్వొకడివి. వాస్తవికతకూ కల్పనకూ ఉన్న హద్దులు చెరిగిపోయినట్టయింది' అంటూ అప్పారావు పగిలిపోయిన గాజుపెంకులను ఏరి, బయటకు విసిరాడు.

కిటికీ రెక్కలు వేశాడు. టేబుల్ పక్కకు జరిపి, కిందపడ్డ కాగితాలను టేబుల్ మీదకు చేర్చాడు.

విడిచిన తడిబట్టలు ఓ మూలకు పడేసి సుబ్బారావు అప్పారావు ఎదురుగా వచ్చి కూర్చున్నాడు.

"ఏమిట్రా రాస్తున్నావ్?"

"కథ రాస్తున్నాను."

'ఏమిట్రా ఆ కథ? అంతగా నరాలు తెంచుకొని రాస్తున్నావ్?'

"గాలికథ!"

"గాలికథేమిట్రా"

"ఇదిగో చదువు, నీకే తెలుస్తుంది."

"ఈమధ్య నువ్వు చాలా చెత్తరాసి పత్రికలు నింపేస్తున్నావని విన్నాను."

"వినడం ఏమిటి? చదవడంలేదా?"

"మొదట్లో చదివేవాణ్ణి! కాని ఇప్పుడు మానేశాను"

"నా గంజాయివనం సీరియల్ చదవలేదా?"

"లేదు."

'పోనియ్, జిల్లేడు పొదలో?'

సుబ్బారావు అడ్డంగా తల ఊపాడు.

'తుమ్మలబీడూ, కపాలమోక్షం, తంత్రాలమర్రి.'

'తంత్రాలమర్రీ-మంత్రాలమర్రీ-నేను ఏదీ చదవలేదు.' చిరాకుపడ్డాడు సుబ్బారావు.

"ఛీ! అందుకే చెత్తాగిత్తా అంటూ మాట్లాడుతున్నావ్. నా 'గంజాయివనం', 'తుమ్మలబీడు' లక్షలాది పాఠకుల్ని ఊపేశాయి. నా సీరియల్‌తో పత్రికల సర్క్యులేషన్ ఐదారురెట్లు పెరిగింది. వీక్లీ, మంత్లీవాళ్ళు నా ముందు క్యూలో నిలబడుతున్నారు. రెండేళ్ళదాకా అడ్వాన్సుగా బుక్ అయిపోయాను."

"రెండేళ్ళదాకా నీ కాల్‌షీట్సు లేవన్నమాట! ఏమిట్రా సినిమా స్టార్‌లా మాట్లాడుతున్నావ్?"

"వాళ్ళ పాప్యులారిటీకి మన పాప్యులారిటీ ఏమి తీసిపోదు. నాకు అభిమాన సంఘాలు వెలుస్తున్నాయి."

"రచయితకు అభిమాన సంఘాలా?" సుబ్బారావు నోరు వెళ్ళబెట్టాడు.

"సాహిత్యంలో రివెల్యూషన్. భావం-భాషా-వస్తువు-శిల్పం-మొత్తం రచనా రీతిలోనే గొప్ప మార్పు. పెద్ద- కిక్!" అని అప్పారావు లేచి కబ్బోర్డు దగ్గిరకు వెళ్ళాడు. ఓ ఫుల్ బాటిలూ, రెండు గ్లాసులూ తెచ్చి బల్లమీద పెట్టాడు.

"సోడా లేదు. వాటర్‌తో తీసుకుంటావా? ఐ ప్రిఫర్ విత్ వాటర్. ఓ-కే!"

"నేనీ మధ్య మానేశానురా!" నసిగాడు సుబ్బారావు.

"చదవడం మానేశావ్! తాగడం మానేశావ్! ఇంకెందుకు బతుకుతున్నట్టు? తినడానికేనా?" అప్పారావు సీసా మూత తీశాడు.

"వచ్చేది తినడానికే సరిపోవడంలేదు. ఇక తాగడానికి ఎక్కడ్నుంచి వస్తుంది? బాధ్యత మీదపడిన తర్వాత తెలుస్తున్నది జీవితం అంటే ఏమిటో!" సుబ్బారావు మూలిగాడు.

"అందుకేరా మనం తెగబడి రెండు చేతులా సంపాదించాలి. చూడు, ఈ బాటిల్ ప్యూర్ స్కాచ్ విస్కీ. బయటకొంటే మూడొందలు, మనకు రెండూ ఏభైకి వచ్చింది. అయినా ఈ బాటిల్ తెచ్చినవాడికి ఏభై మిగులుతుంది. రోజుకు ఆరు బాటిల్స్ అమ్మితే మూడొందలు."

"అంటే, వాడి మూడు రోజుల సంపాదనా నా నెలజీతం! నేను చదివింది ఎం.ఏ సోషియాలజీ-చేసేది రైల్వే బుకింగ్ క్లర్క్."

అప్పారావు రెండు గ్లాసుల్లో విస్కీపోసి నీళ్ళు కలిపాడు.

"ఒరేయ్, నాకొద్దురా!" నసిగాడు సుబ్బారావు.

"డోంట్ మేక్ ఫస్!" అప్పారావు సుబ్బారావు చేతికి గ్లాసు అందించాడు.

"ఛీర్స్!" ఇద్దరూ గ్లాసులు ఎత్తారు.

'అబ్బ! ఛీ! ఇలా ఉందేంటిరా?' సుబ్బారావు కుంకుడురసం తాగినట్టు ముఖం పెట్టాడు.

'ప్యూర్ స్టఫ్! నీకు అలవాటు తప్పిందన్నావుగా? అందులో వాటర్‌తో.'

'అవుననుకుంటా!' తలూపాడు సుబ్బారావు.

'కమాన్! గల్పిట్!' అప్పారావు గబగబ రెండు గుటకలు వేశాడు. సుబ్బారావుచేత పట్టించాడు.

"నువ్వు రోజూ...?" సుబ్బారావు నసిగాడు.

"ఆహా! ఆల్ మోస్ట్ డైలీ!"

"తాగకపోతే రాయలేవా?"

'అనికాదు. ఇట్ ఎలివేట్స్ మై స్పిరిట్స్. రిలీజెస్ మై ఫాకల్టీస్!'

సుబ్బారావు విస్కీ మరో గుటక వేసి "అసలు నువ్వెందుకు రాస్తున్నట్టురా?" అన్నాడు.

"వ్హాట్ డూ యూ మీన్?" అప్పారావు గ్లాసు ఖాళీ చేసి మళ్ళీ విస్కీ వంచుకుంటూ అన్నాడు.

'అసలు ఈ నాన్సెన్సంతా ఎందుకు రాస్తున్నట్టూ? ఎవరికోసం రాస్తున్నట్టూ?'

వీడికి అప్పుడే ఎక్కినట్టుంది. వీడు మాట్లాడేదేమిటి? తను రాస్తున్నది చెత్తా? పనికి రానిదా? లక్షలాది పాఠకులు ఫూల్సా? పత్రికలవాళ్ళు ఇడియట్సా?

అప్పారావు గ్లాసు కిందపెట్టి సుబ్బారావుకేసి తీవ్రంగా చూశాడు.

"అవున్రా! నువ్వెందుకు రాస్తున్నట్టూ?" సుబ్బారావు రెట్టించాడు.

"లక్షలాది నా అభిమానులకోసం. ముఖ్యంగా యువతరంకోసం."

"అబద్ధం! వాళ్ళొచ్చి నిన్ను రాయమని అడిగారా?"

'అడగలేదు. నిజమే! కాని వాళ్ళకోసమే రాస్తున్నాను.'

'అదీ అబద్ధమే. వాళ్ళకోసం కాదు. నీ కోసమే నువ్వు రాస్తున్నావ్! నీకు కీర్తి కావాలి! డబ్బు కావాలి!' గ్లాసు ఖాళీ చేశాడు సుబ్బారావు.

అప్పారావు, సుబ్బారావు గ్లాసులో విస్కీ నింపుతూ అన్నాడు- 'నువ్వు చెప్పింది నిజమే! డబ్బూ కీర్తీ అవసరం లేందీ ఎవరికో చెప్పు! అందరికీ కావాలి. అవి సంపాదించడం తెలియని వెధవలు నీతులు వల్లిస్తారు. ఆదర్శాలను బోధిస్తారు.'

'కష్టపడి డబ్బు కూడబెట్టినవాడెవడూ లేడు. ఒకడి శ్రమను దోచుకొని సంపాదించవచ్చు, మోసంచేసి సంపాదించవచ్చు, దొంగతనం చేసి సంపాదించవచ్చు.'

"సుబ్బులూ! ఇక ఆగరా అక్కడ! నేను అవేమీ చెయ్యడం లేదు. నేను నా రచనలద్వారా సంపాదిస్తున్నాను. నా మేధస్సును కరిగించి సంపాదిస్తున్నాను. ఇందులో అన్యాయం ఏముంది? పాఠకులకు విజ్ఞానంతోపాటు వికాసాన్నీ, ఆనందాన్నీ అందిస్తున్నాను."

"నువ్వు సంపాదించేది విజ్ఞానం కాదు. ఆ పేర మూఢనమ్మకాలకు మెరుగులు దిద్దుతున్నావు. ఆనందం కాదు, అంధకారంలోకి నెడుతున్నావ్. నీకూ తెలుసు సాహిత్యానికి ఓ నిర్దుష్ట ప్రయోజనం ఉంది అని."

'సాహిత్యానికే కాదు బ్రతుక్కుకూడా ఓ ప్రయోజనం ఉంది అని. నీ తెలివితేటలు బెజవాడ స్టేషన్‌లో టికెట్లు కొట్టడంవరకే పరిమితం అయ్యాయి. బట్! అయాం ఏ బార్న్ రైటర్, ఎ జీనియస్. నా తెలివితేటల్ని క్యాష్ చేసుకుంటున్నాను, కీర్తి సంపాదిస్తున్నాను. తప్పా?'

'కీర్తి అంటే నీ ఉద్దేశ్యంలో ఏమిటి? పాప్యులారిటీ! అంతేనా? ఓ రకంగా చూస్తే కీర్తికీ అపకీర్తికీ అట్టే తేడా లేదు. మానవ చరిత్రలో కోట్లాది రచనలు వచ్చి ఉంటాయి. వేలాది రచయితలు పుట్టి ఉంటారు. అందులో ఎన్ని రచనలు మిగిలాయి? ఎంతమందిని మనం గుర్తుంచుకోగలుతున్నాం? అందాకా ఎందుకు, మన తెలుగు సాహిత్యాన్నే తీసుకో. అదీ నవలా సాహిత్యాన్ని తీసుకో-దానికీ ఎంతో చరిత్ర లేదు. కొవ్వలి, జంపన, కుటుంబరావూ, గోపీచంద్ సమకాలికులు-మొదటి ఇద్దరూ ఎన్నో నవలలు రాశారు. కుటుంబరావూ, గోపీచంద్ వాళ్ళు రాసినన్ని నవలలు రాయలేదు. కాని ఈరోజు తన తరంకోసం మిగిలిన రచనలు ఎవరివో నేను చెప్పక్కర్లేదు-నీకూ తెలుసు.'

'అయితే చలం రచనలు నిలవలేదా?" అప్పారావు మళ్ళీ సగం గ్లాసును విస్కీతో నింపాడు.

'చలం రచనలో శాస్త్రీయ దృక్పథం ఉన్నది. సంఘంపై స్త్రీ తిరుగుబాటు ఉంది. అయితే ఆ తిరుగుబాటు సామాజిక పరిధుల్ని దాటి ఉండవచ్చును.'

"నా రచనా శాస్త్రీయమైనదే!" మొండిగా అన్నాడు అప్పారావు.

'అభూత కల్పనలు, దెయ్యాలు, మంత్రాలు, తంత్రాలు శాస్త్రీయమెలా అవుతాయ్?'

అప్పారావు వెంట వెంటనే రెండుసార్లు విస్కీ లాగించి గ్లాసులో మిగిలివున్న దానికేసి చూశాడు. అతని కళ్లు ఎరుపెక్కాయి. తలకు కైపెక్కుతోంది.

"ఒరేయ్ సుబ్బా! నాది నాలుగో రౌండు... నువ్వు... నువ్వింకా రెండు-రెండో రౌండులోనే ఉన్నావు." అప్పారావు మాటలు ముద్దముద్దగా వస్తున్నాయ్.

"నన్ను... కొ... కొంచెం-స్లోగా పోనియ్‌రా!"

'ఆc- ఇందాక ఏమిట్రా అన్నావ్? దెయ్యాలు లేవంటారా! మానవాతీతశక్తులమీద నీకు నమ్మకం లేదా? అయితే ము-ముందీమాట చెప్పు!'

సుబ్బారావు తలెత్తి అప్పారావు ముఖంలోకి చూశాడు. అప్పారావు ముఖం అలుక్కుపోయినట్టు కన్పించింది. తల దిమ్మెక్కిపోతున్నట్టుంది.

"గాలి ఉందా?" అప్పారావు మళ్ళీ ప్రశ్నించాడు.

"ఒరేయ్? నువ్వు తాగే..." అన్నాడు అప్పారావు ప్రశ్న అర్థంకాక సుబ్బారావు.

"ఒరేయ్! నువ్వూ-తాగే-శావు! నువ్వు ఒకటిన్నరకే ఔట్?"

'నో! నో! ఐయామ్ ఆల్‌రైట్! అడుగు!'

"గాలి ఉందా?" అప్పారావు.

"ఉంది! ఉందీ!" సుబ్బారావు.

'ను-నువ్వు చూసేవా?'

'చూళ్ళేదు.'

'ఆc- అయితే ఉందని ఎట్టా చెబుతావ్ బే!'

"బే! బే! ఏంటిరా! నే-న్నేను నీ గెస్టుని."

'ఛత్! ఫ్రండ్! క్లో-జ్-ఫ్రండ్‌విరా! చెప్పు!'

'ఫేన్ ఆపితే గాలిరాదు. వేస్తే వస్తుంది' అన్నాడు సుబ్బారావు. 'అదిగో అటుచూడు! ఆ చెట్టు కొమ్మ ఊగుతుంది. అందుకనే గాలి కన్పించకపోయినా ఉంటుందని అంటున్నా.' మళ్ళీ సుబ్బారావే అన్నాడు.

"విస్కీ వాసన చూశావా?"

"చూషా! హోప్లెస్! కంపు! కంపు!"

'అది కాదు... అది... నీకు కన్పించిందా అని!'

'కన్పించలా-చూశా!'

"కన్పించకపోతే ఎలా చూశావ్? నువ్వు తాగేశావ్‌రా! నువ్వు తాగేషావ్!"

"మరి నువ్వు తాగలేదా?"

అప్పారావు లేచి ముఖంమీద చల్లని నీళ్ళు చల్లుకు వచ్చాడు.

"తాగ్రానా! తాగితే! నా మెదడు షార్పుగా పని చేస్తుంది. మనం చూసి కొన్ని నమ్ముతాం. కొన్ని స్పర్శతో తెలుసుకుంటాం. అలాగే పంచేంద్రియాలద్వారా కొన్నింటిని మాత్రమే తెలుసుకుంటాం. కాని సాధనద్వారా ఎన్నో అతీతశక్తులు ఉన్నాయని తెల్సుకోగలుగుతాం. భౌతిక శాస్త్రం చదివితే కొన్ని తెలుస్తాయి. 'అకల్ట్'-అదీ ఒక సైన్సే. అది అభ్యసిస్తే, సాధన చేస్తే, ఎన్నో మానవాతీత శక్తులు అధీనం అవుతాయి. ఇప్పుడు నేను రాస్తున్న ఈ గాలి కథలో హీరో జితేంద్ర, తన స్వప్నను రక్షించుకోవడానికి 'హైడోరా'ను వశం చేసుకున్నాడు. కఠోర దీక్షా, సాధనవల్ల అది సాధ్యం అయింది. 'హైడోరా'ను చేతబడి శరభయ్య మీద ప్రయోగించడంతో, ఈ కథ ఒక మలుపు తిరుగుతుంది. నియమ నిష్టలను పాటించకపోవడం వలన 'హైడోరా' జితేంద్రను శాశ్వతంగా గాలి రూపంలోనే ఉంచింది. అప్పుడు హీరోయిన్ స్వప్న ఆదిలాబాద్ అడవుల్లోకి వెళ్ళి 'శిఖమణి' దగ్గర మూడు రాత్రిళ్ళూ, మూడు పగళ్ళూ దిగంబర శుశ్రూష చేసి "మైడోరా"ను లేపి 'హైడోరా' మీద ప్రయోగించడంతో ఈ కథ ముగింపు-" అప్పారావు ఆగి సుబ్బారావు ముఖంలోకి

చూస్తూ 'అరేయ్! రేయ్! అదేమిటి అలా అయిపోతున్నావ్?' అన్నాడు.

"కడుపులో ఏదో దేవుతున్నట్టుందిరా!" సుబ్బారావు లేచి బాత్‌రూంలోకి వెళ్ళాడు.

అప్పారావు గ్లాసు ఖాళీచేసి, మళ్ళీ రెండు గ్లాసుల్లో పోసేడు. బాటిల్ చూస్తూ ఇంకో రౌండ్ వస్తుంది అనుకున్నాడు.

సుబ్బారావు తూలుతూ బాత్‌రూంనుంచి బయటికి వచ్చాడు.

'కమాన్ సుబ్బూ! ఫినిషిట్!'

"నా వల్ల కాదు."

"డోంట్ బి సిల్లీ! కమాన్!" గ్లాసులో ఉన్న ఆఖరి చుక్క తాగుతూనే సుబ్బారావు మళ్ళీ బాత్‌రూంలోకి తూలుతూ వెళ్ళాడు.

సుబ్బారావు కక్కుకోవడం అప్పారావుకు విన్పించింది.

అప్పారావుకూ కడుపులో గుడగుడగా అన్పించింది.

"డామిట్! ఇది ఆటో సజెషనా!" అనుకున్నాడు అప్పారావు.

సుబ్బారావు బయటికి వచ్చేసరికి అప్పారావు బాత్‌రూం డోరు దగ్గరే నిలబడి ఉన్నాడు. అప్పారావు బాత్‌రూంలో ఉండగానే సుబ్బారావు గదిలోనే మరోసారి వాంతి చేసుకున్నాడు. "వొరేయ్-నా-కళ్ళు కన్పించడం..."

✿ ✿ ✿

రాత్రి ఒంటిగంట దాటింది.

వర్షం తగ్గిన ఆకాశం ఇంకా నీటి మబ్బులతో ఆవరించే వుంది. దూరంగా కుక్కల ఏడ్పులు విన్పిస్తున్నాయి.

వంతెన పక్క రోడ్డు వారగా వీధి దీపం వెలుగులో రెండు మానవాకారాలు లుంగచుట్టుకొని పడిఉన్నాయి.

సుబ్బారావు ఎంతో ప్రయత్నంమీద చెయ్యి కదిలించాడు.

అప్పారావుకు ఆ దశకూడా దాటిపోయింది.

సుబ్బారావు అప్పారావు చేతిమీద చెయ్యి వేశాడు. అప్పారావుకు స్పర్శజ్ఞానం ఇంకా మిగిలేవుంది. కాని మాటలు పడిపోయినయ్. కళ్ళు కన్పించడంలేదు. కాళ్ళు చచ్చుపడిపోయినై. కడుపులో పేగులు పందికొక్కులు కొరికేస్తున్నాయ్. ఊపిరి సలపడం లేదు. మరణ వేదన!

శరీరాన్ని కొండచిలువ చుట్టి పెనవేస్తున్నది.

తలలో త్రాచుపాములు తిరుగుతున్నాయ్.

తెరమరుగవుతున్న జాగ్రదావస్థ!

సుబ్బారావు తన చేతిని పట్టుకున్నాడు. ఏదో చెప్పాలనుకుంటున్నాడు. వాడికీ తన మాదిరిగానే మాట పడిపోయినట్టుంది. వాడు తనకంటే మూడు పెగ్గులు తక్కువ తాగాడు. అయినా వాడి పరిస్థితీ తనలాగే ఉంది. కాకపోతే కొంతనయం. తనను కదిలించి తనకేదో చెప్పాలని ప్రయత్నం చేస్తున్నాడు.

'అప్పారావూ! మనది దిక్కులేని చావురా! కుక్కలకుకూడా రాదురా! బురదలో పాక్కుంటూ, దేక్కుంటూ కళ్ళు కన్పించకపోయినా, రోడ్డుదాకా తీసుకొచ్చావ్! ఇక్కడ మనల్ని ఆదుకొనేవాడు ఒక్కడూ లేడు. ఆ చావేదో ఆ గదిలోనే చస్తే పోయేది. ఈ రోడ్డు

పక్కన దిక్కులేని చావా? ప్రాణం ఉండగానే కుక్కలు పీక్కుతింటే?

'ఒరేయ్ అప్పడూ! ఎంతపని చేశావురా? స్పురియస్ డ్రింక్-కల్తీ సాహిత్యం-'

సుబ్బారావు చేతివేళ్ళు తన కుడిచేతిని పెనవేస్తున్నాయి. ఆ స్పర్శద్వారానే అతని ఆలోచనలు తనకు కమ్యూనికేట్ చేస్తున్నాడా? ఇదీ సాధ్యమే! తీగల ద్వారా కమ్యూనికేషన్ రావడం లేదా?

"బెంగుళూరులో కల్తీ సారా తాగి మూడు వందల ఇరవై ఐదుమంది దారుణంగా మరణించారు. కాదు, హత్య చేయబడ్డారు. రేపు పేపర్లో వచ్చే వార్త నాకిప్పుడే కన్పిస్తుందిరా! కల్తీ స్కాచ్ తాగి ఇద్దరు యువకుల దుర్మరణం!"

"ఒరేయ్, నువ్వు నాన్‌సెన్స్ మాట్లాడుతున్నావ్! నువ్వు అమాయకుడివి. నీ గురించి అంతకంటే ఇంకేం రాయరు. కాని నా సంగతి వేరు. అన్ని పేపర్లు ప్రముఖంగా ప్రచురిస్తాయి. ప్రఖ్యాత నవలా రచయిత అప్పారావ్ మనకికలేడు. లక్షలాది పాఠకుల హృదయాల్లో చీకటి అలుముకుంది."

'రేయ్, మృత్యువు గుండెలమీద కూర్చున్నా అహం చావలేదురా నీకు. హూచ్ కింగ్ సుల్తాన్, ఏస్ స్మగ్లర్ మస్తాన్, హంతకులు-రంగా-బిల్లాలు.'

'ఐ కాంట్ బేరిట్. వాళ్ళు యాంటీ సోషల్ ఎలిమెంట్స్. వాళ్ళతో నన్ను పోలుస్తావా?'

'నువ్వు వాళ్ళందరికంటే పెద్ద యాంటీ సోషల్ ఎలిమెంటువి. డబ్బుకోసం, సెక్సుకోసం నేరాలు చేసేవాళ్ళకంటే నువ్వేమీ తీసిపోవు. నీ రాతల్లో మిథేల్ ఆల్కహాల్ ఉంది. నువ్వు తాగిన విస్కీలో మిథేల్ ఆల్కాహాల్ కల్పిన వాడెంత నేరస్తుడో నువ్వూ అంత నేరస్తుడవే. ఇది ఇన్‌స్టెంట్ పాయిజన్. నీది స్లో పాయిజన్. వాడు కలిపిన విషంతో చచ్చేది తాగడానికి అలవాటుపడినవాళ్ళే, కాని నువ్వు కలుపుతున్న విషంతో ఎన్నో లేత మనసులు వాడి, మాడి, బూడిద అయిపోతున్నాయి.'

'ఇంకాపరాబాబూ! ఎవడో మనవైపే వస్తున్నాడు.' అరవాలని ప్రయత్నించాడు అప్పారావు. కాని గవదలు బిగుసుకుపోయినై.

అంతవరకూ తనకు విన్పించిన మాటలు ఎవరివి? తన ఆత్మ ఘోషేనా అది!

మిథేల్ ఆల్కహాల్ విషం అప్పారావు మెదడును పూర్తిగా ఆక్రమించింది. ఆలోచనా శక్తి మందగించిపోసాగింది. కనీ కనిపించని కళ్ళతో బయటిప్రపంచాన్ని చూడటానికి ప్రయత్నిస్తున్నాడు, వినీ వినిపించని చెవులతో వినడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

ఎవరో తనమీదకు వంగి చూస్తున్నాడు. ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాడు. ఛాతిమీద తలపెట్టి విన్నాడు.

మహాత్ముడెవరో తనను రక్షించడానికి వచ్చాడు. "ఆసుపత్రికి చేర్చు బాబూ! నీకు పుణ్యం ఉంటుంది."

అదేమిటీ, అతను వెళ్ళిపోతున్నాడేం? 'బాబూ! అయ్యా! నేను ఇంకా చచ్చిపోలేదు, బతికే ఉన్నాను. ఆసుపత్రికి చేర్చు. నీకు ఎంత డబ్బు కావాలన్నా ఇస్తా.' అప్పారావు మనసు రోదిస్తున్నది.

'భాయ్, రిక్షా ఆపు!' ఎదురుగా వస్తున్న రిక్షాను ఆపాడు చంద్రయ్య.

'అరే నువ్వా చంద్రయ్యా? ఏం కథ ఈడుంటివి? కిరాయుందా?'

'కిరాయి కాదు, అగ్గో, గాడ ఇద్దరు మనుషులు పండింద్రి బహుత్ బీమార్

ఉన్నారు. దవాఖాన తానికి తోలుకపోతే బతుకతరో ఏమో!'

కాశిం రిక్షా దిగి చంద్రయ్యతోపాటు సుబ్బారావూ, అప్పారావూ పడివున్న చోటుకు వచ్చాడు.

"అరే భాయ్! ఈ కిరికిరి మనకెందుకు? దవాఖాన తొవ్వలో గడబడ్లున్నాయి" అన్నాడు కాశిం.

"అట్టనకు కాశిం భయ్! ఈళ్ళకి పానం మీదికి వచ్చింది. మదద్ ఇవ్వల! గెట్లయిన మనం మనుసులుం గద!"

✿ ✿ ✿

మరునాటి సాయంత్రం.

సుబ్బారావు ఆసుపత్రి బెడ్‌మీద లేచి కూర్చుని "ఈ వార్త చూశావా?" అన్నాడు.

పక్కబెడ్‌మీద ఉన్న అప్పారావు పత్రిక అందుకొని చదివాడు.

"నగరంలో నేడుకూడా చదురు మదురు అల్లర్లు జరిగాయి. పాత నగరంలో ఒక రిక్షావాలా, గౌలిగూడాలో మరో రిక్షావాలా కత్తిపోట్లకు గురి అయి అక్కడికక్కడే మరణించినట్టు తెలియవస్తుంది."

"ఓ గాడ్!" అప్పారావు పెద్దగా అరిచాడు.

"నీ దేవుడు దెయ్యాలతో ఆడుకుంటున్నాడురా!"

సుబ్బారావు గొంతు దుఃఖంతో పూడిపోయింది.

(జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక-1985)